క్లుప్తంగా

నేటి నుంచి ఎఫ్ఏ-2 పరీక్షలు

ఆదోని సెంట్రల్: ప్రాథమికోన్నత, ఉన్నత, అన్ని యాజమాన్య పాఠశాలలు మంగళవారం నుంచి ఫార్మేటివ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ) 2 పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి బి.శివారములు తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు నిర్దేశించిన సిలబస్ ప్రకారం పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పరీక్ష సమయానికి గంట ముందు మండల విద్యాశాఖాధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశ్న పత్రాలను పంపిస్తారని తెలిపారు. ఉమ్మడి ప్రశ్న పత్రం ఆధారంగా పాత పద్ధతిలోనే పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం ఒకటి, మధ్యాహ్నం మరో పరీక్ష నిర్వహిస్తారు. 6,7 తరగతులకు మధ్యాహ్నం పరీక్షలు, 8,9 తరగతులకు సీబీఎస్ఈ విధానంలో ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాధాన పత్రాల మూల్యాంకనం తర్వాత ఆన్‌లైన్ పోర్టల్‌లోనూ మార్కులను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం ఈ నెల 14వ తేదీ నుంచి 24 వరకు దసరా సెలవులను ప్రకటించినట్లు తెలిపారు.

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుదాం


పెద్దకడబూరు గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ రామాంజనేయులు

పెద్దకడబూరు: జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని స్వచ్ఛతలో ఆదర్శంగా తీర్చిదిద్దుకుందామని సర్పంచ్ రామాంజనేయులు పిలుపునిచ్చారు. గాంధీ జయంతి పురస్కరించుకొని మండల కేంద్రంలోని సచివాలయం -1, 2లలో సోమవారం గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అందులో భాగంగానే గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని కొనియాడారు. యువత, ప్రజలు గ్రామ, మండల అభివృద్ధికి సహకరించాలని, ఆదర్శ గ్రామం, మండలంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆదోనివాసికి జ్యోతిష్య ప్రముఖ్ అవార్డు


అవార్డు అందుకుంటున్న ఆదోని జ్యోతిష్యుడు కమలనాభ శర్మ

ఆదోనిఅర్బన్: బ్రాహ్మణ సంక్షేమ వేదిక ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి జరిగిన జ్యోతిష్య పండిత మహా సదస్సులో ఆదోనివాసికి జ్యోతిష్య ప్రముఖ్ అవార్డు దక్కింది. ఈ మేరకు వ్యవస్థాపక కార్యదర్శి బాల శ్రీనివాసులు, బంగారయ్య శర్మ, జ్యోతిష్య పండితులు రాజేశ్వర శర్మ చేతులమీదుగా పట్టణానికి చెందిన జ్యోతిష్య పండితులు కమలనాభ శర్మ అవార్డును అందుకున్నారు. సమాజంలో జ్యోతిష్యులు మార్గదర్శకులుగా ఉన్నారని, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పండితులకు అవార్డులను అందజేస్తున్నట్లు వ్యవస్థాపకులు తెలిపారు. జ్యోతిష్య ప్రముఖ్ అవార్డు రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, బ్రాహ్మణ సంక్షేమ సంఘం వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆహార కిట్లు పంపిణీ

ఆదోనిఅర్బన్: జాతిపిత మహాత్మాగాంధీజీ జయంతి సందర్భంగా ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఆహార కిట్లను పంపిణీ చేశారు. ఎన్ఆర్ఐ సంఘ సేవకులు కాకుబాళ్ నగేష్ వివిధ సంఘ పెద్దలతో కలిసి గాంధీ పార్కులోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని 150 మంది రోగులకు బ్రెడ్డు, పండ్లు, బిస్కెట్లు, నీరు, ఆహారం కలిగిన కిట్లను పంపిణీ చేశారు. అవోపా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనాగుప్తా, మిరియాల శ్రీధర్, బుశెట్టిసురేష్, వెంకటేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ పూర్తి చేయండి

కౌతాళం: ఈనెల 4వ తేదీలోగా ఈ-కేవైసీని పూర్తి చేయాలని ఏఓ శేషాద్రి ఆదేశించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. వలంటీర్లకు లాగిన్ పాస్‌వర్డ్ ఇవ్వడం జరిగిందని, తమ లాగిన్‌లో రైతులకు ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. ఈ-కేవైసీ పూర్తయితేనే రైతులకు పంట నష్ట పరిహారం, బీమా, ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయన్నారు. రైతులు సంబంధిత వలంటీర్ లేదా ఆర్బీకేల్లో సంప్రదించి ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు.

పద్మశాలి సేవా సంఘం సమావేశం

ఆదోనిఅర్బన్: పద్మశాలి సేవా సంఘం జనరల్ బాడీ సమావేశం సోమవారం స్థానిక మార్కండేయస్వామి ఆలయ ఆవరణలో చేపట్టారు. ఇందులో పద్మశాలి సేవా సంఘం ప్రెసిడెంట్‌గా మళ్లీ లక్ష్మన్నకే పదవి దక్కింది. మూడు సంవత్సరాల సుదీర్ఘ పాలన దక్కడం పట్ల కులబంధువులు అందరూ హర్షం వ్యక్తం చేశారు. లక్ష్మన్న మాట్లాడుతూ మార్కండేయ స్వామి దేవాలయం రూపురేఖలు మార్చేవిధంగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. నూతన ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, కులబాంధవులు విరాళం అందజేయాలని పిలుపునిచ్చారు.


ఆదోనిలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓ శివరాములు తదితరులు


ఆదోనిలో నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు


ఆదోనిలో నివాళులర్పిస్తున్న ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు

మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం


ఆదోనిలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు


ఆదోనిలో మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, అధికారులు

ఆదోనిరూరల్: పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో సోమవారం జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాయయంలో సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ సేవలను కొనియాడారు. అహింసామార్గంలో బ్రిటీష్ వారితో పోరాడి దేశ సంగ్రామంలో అహర్నిశలు పోరాటాలు చేసిన గొప్ప యోధుడు అని చెప్పారు. గాంధీజీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, సీనియర్ సహాయకులు రామచంద్ర, ఆర్ఐ జయరాంరెడ్డి, జూనియర్ సహాయకులు ఉదయ్, వీఆర్వో రాజశేఖర్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓ శివరాములు ఆధ్వర్యంలో గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు.

ఆదోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షులు కె.యు.అనితభాయి తదితరులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ అంజనప్ప, దేశాయ్, ఇస్మాయిల్ సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. విరుపాపురం గ్రామ సచివాలయంలో సర్పంచ్ ప్రహ్లాదయాదవ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు.

ఆదోని సెంట్రల్: స్వాతంత్ర్య సమర యోధులు, జాతిపిత మహాత్మ గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్టీయూ నాయకులు సి. నాగరాజు, రమేష్ నాయుడు, నరసింహులు, సత్య పేర్కొన్నారు. సోమవారం ఎస్టీయూ కార్యాలయంలో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్టీయూ నాయకులు వీరచంద్రయాదవ్, సుంకన్న, మహాదేవప్ప, గోపాల్, హనుమన్న, రామంజి. జంబులయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

● అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు తాయన్న మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రం కోసం గాంధీజీ, ఎల్‌బీ శాస్త్రి చేసిన సేవలను కొనియాడారు.

ఆదోనిటౌన్: జాతిపిత మహాత్మాగాంధీజీ అడుగుజాడల్లో నడుద్దామని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, అధ్యక్షుడు దేవా పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా మున్సిపల్ పీస్ పార్కులోని గాంధీజీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అక్కడ గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో భారతీయులనంతా ఒకేతాటిపైకి తెచ్చిన ఘనత మహాత్మాగాంధీకే దక్కిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జాతిపిత ఆశయాలను నెరవేరుస్తున్నాడన్నారు. అవినీతి రహిత పాలన చేస్తూ పేదలకు సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్నాడని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేదోడికి కూడు, గూడు, గుడ్డ అందించాలన్న లక్ష్యాన్ని జగనన్న నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నెరవేర్చారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు రేణుక, మంజుల, అహ్మద్‌బాషా, జిలేకాబీ, సుగుణమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, కౌన్సిలర్లు నరసింహులు, చలపతి, రామలింగేశ్వరయాదవ్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి


మంత్రాలయంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసులు


మంత్రాలయంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య నేతృత్వంలో జాతిపితకు నివాళి

మంత్రాలయం: మంత్రాలయం మండలంలో గాంధీ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, మాధవరంలో ఎస్ఐ కిరణ్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్, పంచాయతీ తరఫున సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ సేవలను కొనియాడరు. ఈఓ నాగరాజు, ఉపసర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్‌శెట్టి తదితరులు ఉన్నారు.

కోసిగి: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అయ్యమ్మ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న, తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ తిక్కస్వామి ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అలాగే గాంధీనగర్ కాలనీలో కాలనీకి వెళ్లే బోర్డు వద్ద అంజినయ్య ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి కాలనీవాసులు సంబరాలు జరుపుకున్నారు. ఈఓపీఆర్డి ఆరూన్ రషీద్, వైఎస్సార్ సీపీ నాయకులు మాణిక్యరాజు, కోసిగయ్య, బండ్ల గోవిందు, కురువ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి బాటలు వేద్దామని గ్రామ పెద్దలు, రిటైర్డ్ వీఆర్ఓ ఆర్.రామలింగారెడ్డి పిలుపునిచ్చారు. గాంధీజీ జయంతి పురస్కరించుకొని స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


కోసిగిలో నివాళులర్పిస్తున్న గ్రామ సర్పంచ్ అయ్యమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు

కౌతాళం: మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు సోమవారం కౌతాళంతో పాటు కుంబళనూరు, బాపురం, ఎరిగేరి హాల్వి తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కౌతాళం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పాల్‌దినాకర్, కార్యదర్శి చెన్నయ్య ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సభలు నిర్వహించి పలు తీర్మానాలు చేశారు.


పెద్దకడబూరు తహసీల్దారు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం


కౌతాళం పంచాయతీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

వేదభూమిలో భక్తుల కోలాహలం


శ్రీమఠం కారిడార్‌లో భక్తుల రద్దీ

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి క్షేత్రంలో భక్తుల కోలాహలం నెలకొంది. వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో వేదభూమి కళకళలాడింది. ఆది, సోమవారాలు సెలవు దినాలు కావడంతో మంత్రాలయానికి భక్తుల తాకిడి కొనసాగింది. రాఘవేంద్రస్వామి దర్శనానికి 2 గంటలకు పైగా సమయం పట్టింది. రాఘవేంద్రుల సర్వ దర్శనం, సేవా దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. తుంగభద్ర నదికి వర్షపు నీరు రావడంతో నదీ తీరం సందడిగా కనిపించింది. గ్రామ దేవత మంచాలమ్మ, అన్నపూర్ణ భోజన శాల, పరిమళ ప్రసాదం, పంచామృతం, తీర్థ ప్రసాద కౌంటర్లు భక్తులతో బారులు తీరారు. మఠం మేనేజర్ వెంకటేష్‌జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రక్తదానం చేసేవారే అసలైన హీరోలు


రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే ప్రతిఒక్కరూ సూపర్ హీరోలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి వేడుకల్లో భాగంగా మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో బ్లడ్ డోనర్స్ యూత్ ఆధ్వర్యంలో ఆదినారాయణరెడ్డి నిర్వహణలో కన్నడ పాఠశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన సబ్‌కలెక్టర్ రక్తదాతలను అభినందించారు. యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, ఉప తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఆర్ఐ జయరామ్‌రెడ్డి, వీఆర్వోలు తిరుమల రెడ్డి, రాజశేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

తలసేమియా బాధితుల కోసం రక్తదానం


రక్తదాతలకు పండ్లు, సర్టిఫికెట్ అందజేస్తున్న ఎస్ఐ సతీష్‌కుమార్, మహంతేష్ స్వామి

కోసిగి: కర్నూలు జిల్లాలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్న పిల్లల ప్రాణాలు కాపాడేందుకు మానవత దృక్పథంతో రక్తదానం చేసిన వారిని కోసిగి ఎస్ఐ సతీష్ కుమార్ అభినందించారు. సోమవారం మహాత్మ గాంధీ జయంతి పురస్కరించుకుని కోసిగిలో శ్రీ రేణుక ఎల్లమ్మ మైదానంలో కోసిగి కేదారి ల్యాబ్ డయాగ్నోస్టిక్ సెంటర్ వారి ఆధ్వర్యంలో కర్నూలు అక్షయ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు మహంతేష్ స్వామి, జగదీష్ స్వామి సమక్షంలో దాదాపు 100 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కర్నూలు మెడికల్ కళాశాల డాక్టర్ మంజులత మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 250 మంది వరకు తలసేమియా బాధిత చిన్నారులు ఉన్నారన్నారు. ఆ పిల్లలకు 20 రోజులకోసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందన్నారు. చిన్నారులను కాపాడేందుకు రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తలసేమియా సొసైటీ టెక్నీషియన్ వంశీ, ఏఎస్ఐ నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం


పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న గ్రామ సర్పంచ్ అయ్యమ్మ, పంచాయతీ సిబ్బంది

కోసిగి: స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య కార్మికులకు శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్లు, ప్రజలు, పారిశుధ్య కార్మికులతో కలిసి గ్రామ సభ నిర్వహించారు. ముందుగా సిద్దప్ప పాళెం 8వ వార్డు మెంబర్‌గా ఉన్న ముకుంద ఈరన్న అనారోగ్యంతో మృతి చెందడం పట్ల ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. ఆయన 25 ఏళ్ల పాటు 5 పర్యాయాలు వార్డు మెంబర్‌గా గెలుపొందారన్నారు. అనంతరం ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్ మాట్లాడుతూ గ్రామాలను శుభ్రంగా ఉంచడంతో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివన్నారు. పంచాయతీ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

తప్పు చేయకపోతే చంద్రబాబుకు భయమెందుకు?


నూతన భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, సీతారామిరెడ్డి


గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పిస్తున్న దృశ్యం

మంత్రాలయం: చంద్రబాబు అవినీతి చేయకపోతే భయమెందుకని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రశ్నించారు. సోమవారం మండల పరిధిలోని వి.తిమ్మాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను టీటీడీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి జై భీమ్ వ్యవస్థాపకులు జానయ్య నేతృత్వంలో, అలాగే మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీలో అభివృద్ధి పేరుతో మాజీ సీఎం చంద్రబాబునాయుడు అందిన కాడికి దోచుకున్నారని మండిపడ్డారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. గ్రామంలోనే సచివాలయ వ్యవస్థతో పాటు రైతుల కోసం ఆర్బీకేలు, ప్రజలకు వైద్య సేవలందించేందుకు హెల్త్ సెంటర్‌లు ఏర్పాటు చేశారని వివరించారు. నూతన భవనాల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ జిమ్మికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పూలమాల వేసి శాలువా కప్పి సన్మానించారు. అంతకుముందు బూదూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనంను టీటీడీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు జి.భీమారెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ మణిమంజరి, ఏడీఏ మహ్మద్ ఖాద్రి, పీఆర్ ఏఈ నరసింహులు, సర్పంచ్ వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

మానవత్వంతో మెలగాలి

కౌతాళం: అందరూ కలిసి మెలసి మానవత్వంలో మెలగాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిప్పలదొడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చిని పాస్టర్లు రాజారత్నం, విజయ్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అందరు కలిసి కట్టుగా ఉండాలని కోరారు. చర్చిలో కేక్ కట్ చేసి యేసును స్మరించారు. నాయకులు అంపయ్య, ఈడిగ వీరేష్, అయ్యప్ప, శంకర్ రెడ్డి, ఉలిగయ్య, గుండప్ప, రామాంజినేయులు పాల్గొన్నారు.

నేడు హాల్వి‌లో గడప గడపకు మన ప్రభుత్వం

కౌతాళం: మండల పరిధిలోని హాల్వి గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్బా రాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమం 5 రోజుల పాటు చేపట్టనున్న ట్లు వివరించారు. అలాగే కౌతాళం సచివాలయం-2 పరిధిలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శి బిరానికి ఎమ్మెల్యే హాజరుకానున్నట్లు వెల్లడించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ హరిక్రిష్ణ

ఆదోనిరూరల్: డివిజన్‌లోని కౌతాళం గ్రామం పాత బస్టాండ్ వీధిలో నివాసముంటున్న భారతి అనే మహిళ తన రేకుల షెడ్డులో 10 కర్ణాటక మద్యం ఓసీ డీలక్స్ విస్కీ మద్యం బాక్సులను దాచి ఉంచగా పక్కా సమచారం మేరకు దాడులు నిర్వహించి అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ హరిక్రిష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం సదరు మహిళను విచారించగా బాక్సులను తానే ఉప్పరహాల్ గ్రామానికి చెందిన బోయ రంగ అనే వ్యక్తి ద్వారా తెప్పించుకున్నట్లు తెలిపిందన్నారు. ఆమెను అరెస్టు చేసి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఆదోని సెబ్ ఎస్ఐలు శివప్రసాద్, మధుసూదన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం


కేవీపీఎస్ జెండావిష్కరణ చేసి నినాదాలు చేస్తున్న నాయకులు

కోసిగి: మండల పరిధిలోని చిన్నభూంపల్లి, పెద్ద భూంపల్లి గ్రామాల్లో కేవీపీఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రామంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి రామ్ కోటి ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవీపీఎస్ ఆధ్వర్యంలో కులవివక్ష రూపుమాపేందుకు నిరంతరం శాయశక్తులా పోరాటాలు చేస్తున్నామన్నారు. అంటరానితనానికి వ్యతిరేకంగా దళితులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అలాగే డప్పు, కళాకారులు, చర్మకారులకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. కేవీపీఎస్ నాయకులు దిలీప్, శ్రీనివాసులు, హనుమంతు, ముక్రన్న తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: కుల వివక్ష వ్యతిరేక పోరాటంలో కేవీపీఎస్ కృషి ఎనలేనిదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, కేవీపీఎస్ నాయకులు మారెయ్య, తాయన్న అన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని రౌడూరు, లింగలదిన్నె, పొదలకుంట గ్రామాల్లో కేవీపీఎస్ జెండాలను అవిస్కరించారు. వారు మాట్లాడుతూ అంటరాని తనం, కోసం కులవివక్షకు వ్యతిరేకంగా కేవీపీఎస్ 25 సంవత్సరాలుగా నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు, దౌర్జన్యాలు, మానభంగాలు, అత్యాచారాలు జరుగుతున్నా పట్టికోవడం లేదన్నారు. వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ అధికారిణిగా ఎంపీడీఓ గీతావాణి


జిల్లా జేసీ నారపురెడ్డి మౌర్య చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఆదోని ఎంపీడీఓ గీతావాణి

ఆదోనిరూరల్: కర్నూలులోని డీసీబీసీ సెంటర్‌లో జరిగిన గాంధీ జయంతి వేడుకల సందర్భంగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కార్యక్రమంలో భాగంగా ఆదోని ఎంపీడీఓ గీతావాణి ఉత్తమ కార్యనిర్వహణాధికారిగా ఎంపికయ్యారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బాధ్యతగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ముందుకెళ్తున్నానని, తనను ప్రశంసించడం సంతోషంగా ఉందని చెప్పారు. డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి, డీఏఫ్ఓ, ఉపాధిశాఖ అధికారులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య


మాదిగ యంకన్న (ఫైల్)

దేవనకొండ: మండలంలోని ఐరన్‌బండ బి.సెంటర్ గ్రామానికి చెందిన రైతు మాదిగ యంకన్న (39) అప్పుల బాధ తాళలేక సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. యంకన్నకు మూడున్నర ఎకరాల పొలం ఉంది. ఆ భూమిలో ఏటా వివిధ రకాల పంటలను సాగు చేస్తూ పంటల పెట్టుబడులకు అప్పులు చేశాడు. అప్పులు ఎక్కువై రూ.4 లక్షలకు చేరాయి. వాటిని ఎలా తీర్చాలో తెలియక రోజూ మధనపడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ స్థితిలో అప్పుల బాధతో ఫీల్డన్ గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. మృతుడికి గొనెగొండ్ల మండలం నేరెడుప్పల పంచాయతీలో పొలం ఉంది. ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.